

## మోసపోతే గోసపడతాం

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోందని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ ఆరోపించారు. 8లో▸



## ప్రజా సేవతోనే సార్థకత

ప్రజా సేవలోనే జీవితం సార్థకం అవుతుందని రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. 8లో▸



## ప్రతి హామీ అమలు చేయాలి

కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి కోరారు. 9లో▸

## న్యూస్‌రీల్

### నేడు జాబ్‌మేళా

**అనంతగిరి:** వికారాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సుభాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లిప్‌కార్ట్ నందు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. యువకులు మాత్రమే హాజరుకావాలని కోరారు. పది ఆపై చదివిన వారు అర్హులన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

**జిల్లా ఇంటర్ నోడల్ ఆఫీసర్ శంకర్ నాయక్**



ప్రిన్సిపాళ్లతో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

**అనంతగిరి:** ఇంటర్మీడియట్‌లో 100శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రిన్సిపాళ్లు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ నాయక్ సూచించారు. మంగళవారం వికారాబాద్‌లో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి ద్వారానే లక్ష్యాలను సాధించడం సాధ్యమవుతుందన్నారు. ప్రతి విద్యార్థీ తెలుగు అకాడమీ పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలన్నారు. ఒత్తిడి లేని విద్యను అందించాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాళ్లు రాజమోహన్, చెన్నయ్య, నరసింహారెడ్డి, కుమారస్వామి, శోభారాణి, సురేశ్వరస్వామి, మంజుల, కార్యాలయ సిబ్బంది వినోద్, సలీమా బేగం, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ మోర్చా జిల్లా ఇన్‌చార్జ్‌గా పురుషోత్తం




**తుర్కయంజాల్:** ఎస్సీ మోర్చా వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్‌కు చెందిన కొంద్రు పురుషోత్తం నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధి కొరకు మరింత బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టినందుకు శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, క్రమ శిక్షణ కమిటీ రాష్ట్ర సభ్యులు బోసుపల్లి ప్రతాప్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### మంత్రి వర్గంలో మల్‌రెడ్డికి చోటు?

**అకస్మాత్తుగా ఎమ్మెల్యే పర్యటన రద్దు**

**అబ్దుల్లాపూర్‌మెట్:** మండల పరిధిలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల కోసం మంగళవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటించాల్సి ఉండగా అకస్మాత్తుగా ఆయన పర్యటన రద్దయింది. అభివృద్ధి కార్యక్రమాలకు హాజరు కావడానికి అరగంట ముందే ఢిల్లీ నుంచి ఎమ్మెల్యేకు పిలుపు రావడంతో ఆయన మండల పర్యటనను రద్దు చేసుకున్నట్లు తెలిపారు. కాగా ఈ నెల 4న రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ప్రచారం జరుగుతున్న వేళ మల్‌రెడ్డి రంగారెడ్డికి ఏఐసీసీ నుంచి పిలుపు రావడంతో మంత్రి వర్గంలో ఆయనకు చోటు దక్కే అవకాశాలున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు.

### తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్‌గా అమరేందర్‌రెడ్డి



**తుర్కయంజాల్:** తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్‌గా కె.అమరేందర్ రెడ్డిని నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇక్కడ ఇన్‌చార్జి కమిషనర్‌గా మీర్‌పేట కమిషనర్ బి.చంద్రశేఖర్ కొనసాగుతున్న విషయం విదితమే.

### బంద్‌ను సక్సెస్ చేయండి

**పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్**

**చేవెళ్ల:** నీట్, నెట్ పేపర్ల లీకేజీని నిరసిస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 4న దేశ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి రాజేశ్ అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. పరీక్ష పేపర్ లీకేజీకి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

# నిషేధిత విక్రయాలు

## ఫర్టిలైజర్ దుకాణాల్లో ఇష్టానుసారంగా నిషేధిత మందుల అమ్మకాలు

- తూతూమంత్రంగా తనిఖీలు
- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

**పరిగి:** రైతులు, ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిన కొన్ని గడ్డి నివారణ మందులను కేంద్ర ప్రభుత్వం నిషేధించినా బహిరంగ మార్కెట్‌లో ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారు. ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నా పెద్దగా ఫలితం కనిపించడం లేదు. గ్లైసెల్, మోనోక్రొటోపాస్, గెమాక్సిన్, మలపియాన్ ఇలా చాలా రకాల వ్యవసాయ మందులను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. వీటిని పంటలపై పిచికారీ చేసే సమయంలో వాసన పీలిస్తే రైతుల ఆరోగ్యం దెబ్బతింటుంది. అంతేకాకుండా పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకునే ప్రజలు రోగాల బారిన పడతారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని నిషేధించారు.



పరిగిలోని ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

### ఎరువుల దుకాణాల్లో..

రైతులు, ప్రజారోగ్యం దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని రసాయనాల మందులను నిషేధించాయి. వాటి వాడకం వల్ల ప్రజలకు పలు రకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయని నిర్ధారణ కావడంతో వాటిని బ్యాన్ చేశారు. అంతేకాకుండా పంటలకు వ్యాపించే కీటకాలను నివారించేందుకు, కలుపు నివారణకు మందులు వాడటం ద్వారా భూమిలో ఉండి పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు కూడా చనిపోతున్నాయని పరిశీలనలో తేలింది. కీటకాల నివారణకు పిచికారీ మందు పంట దిగుబడిపై అలాగే ఉండిపోతుంది. వాటినే ప్రజలు ఆహారంగా తీసుకుంటున్నారని అధికారులు గుర్తించారు. దీంతో ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా పలు ఆరోగ్య సమస్యలు వస్తున్నట్లు తేల్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదుల సంఖ్యలో పలు రకాల కంపెనీల మందులను నిషేధించాయి. కానీ ఫర్టిలైజర్ దుకాణదారులు అలాంటి వాటిని ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారు. కొంత మంది వ్యాపారులు రహస్య ప్రదేశాలు, గోదాంలలో నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం.

### మామూళ్ల మత్తులో..

పరిగి నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో దాదాపు 1,50,000 ఎకరాల సాగు భూమి ఉంది. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో లక్ష ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. పత్తి, మొక్కజొన్న, జొన్న, పెసర్లు, వరి వంటివి ప్రధానమైనవి. నియోజకవర్గంలో వంద వరకు ఫర్టిలైజర్ దుకాణాలు ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో కలుపు ఎక్కువగా పెరిగింది. కలుపు నివారణ మందులను నిషేధించినా కొంతమంది గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. ఈ విషయం వ్యవసాయ శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

### కఠిన చర్యలు తీసుకుంటాం



నిషేధిత మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఫర్టిలైజర్ దుకాణదారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ఎక్కడైనా విక్రయిస్తున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తేవాలి. అలాంటి దుకాణాల లైసెన్సులను రద్దు చేస్తాం.

– ప్రభాకర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, పరిగి



వేలం పాటలో పాల్గొనేందుకు వచ్చిన రైతులు

# కౌలు వేలం వాయిదా

- గతం కంటే తక్కువ ధరకు పాట
- ఆపేసిన ఎండోమెంట్ అధికారులు
- 7న నిర్వహిస్తామని వెల్లడి

**దోమ:** మండలంలోని దొంగ ఎన్కేపల్లి శ్రీ సంజీవ స్వామి ఆలయ భూముల కౌలు వేలం వాయిదా పడింది. మంగళవారం ఈఓ సుధాకర్, ఎండోమెంట్ అధికారి మధుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో ఆయా గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ ఆలయానికి 104 ఎకరాల 19 గుంటల భూమి ఉంది. గూడూర్ గ్రామ పరిధిలోని భూములను మాత్రమే వేలం నిర్వహించారు. గ్రామ సర్వే నంబర్ 135లోని ఆలయ భూములను రెండేళ్ల క్రితం ఓ రైతు రూ. 1,47,000కు కౌలుకు పొందాడు. ప్రస్తుతం నిర్వహించిన వేలంలో గూడూర్ గ్రామానికి చెందిన బిచ్చయ్య అనే రైతు రూ.75లకు పాట పాడారు. అలాగే సర్వే నంబరు 66లోని 14 ఎకరాల భూమిని గతంలో రూ.2,40,000కు పాట పాడగా, ప్రస్తుతం కొత్తురు రమేశ్ రూ. 1,50,000కు పాట పాడారు. అలాగే సర్వే నంబర్లు 173, 174లోని 20.15 గుంటల భూమిని గతంలో రూ.90 వేలకు పాట పడగా ప్రస్తుతం నరేందర్‌రెడ్డి అనే వ్యక్తి రూ. 60 వేలకు పాట పాడారు. ఇలా తక్కువ ధరకు వేలం పాడటంతో అధికారులు పాటను రద్దు చేశారు. తిరిగి సోమవారం (7వ తేదీ) నిర్వహిస్తామని తెలిపారు.

### నష్టపోయాం ఆదుకోండి

గతంలో ఆలయ భూములను రెండేళ్ల పాటు కౌలుకు తీసుకున్న రైతులు తాము పూర్తిగా నష్టపోయామని మరో ఏడాది కౌలుకు ఇచ్చి ఆదుకోవాలని అధికారులను కోరారు. మరో సారి అవకాశం ఇవ్వకపోతే అప్పులపాలవుతామని తెలిపారు. ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేయాలని కోరారు. అయితే ఈ అంశం తమ పరిధిలో ఉండదని, కేవలం వేలం నిర్వహించడమే తమ బాధ్యతని అధికారులు వివరించారు.

### పారదర్శకంగా నిర్వహించాలి

ఆలయ భూముల కౌలు వేలం పారదర్శకంగా నిర్వహించాలని పలు గ్రామాల రైతులు కోరారు. అధికారులు కొంత మందికి మాత్రమే వేలం పాటలో పాల్గొనే ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. కావాలనే వేలం జరగకుండా చూశారని పేర్కొన్నారు. ఈ విషయంపై ఈఓ సుధాకర్‌ను వివరణ కోరగా ఆలయ భూముల వేలం పాటను పాదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. గతం కంటే తక్కువ ధరకు వేలం పాడటంతో వాయిదా వేశామని తెలిపారు. సోమవారం మరోసారి వేలం నిర్వహిస్తామని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

# రైతు దేవునితో సమానం

- వారి సమస్యల పరిష్కారానికి కృషి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

**నవాబుపేట:** దేశానికి అన్నం పెట్టే రైతులు దేవునితో సమానమని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రైతు భరోసా పథకంపై అన్నదాతల నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. మండలంలో ఏయే పంటలు సాగు చేస్తారని, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం 70 శాతం వ్యవసాయంపై ఆధారపడి ఉందన్నారు. రైతులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఆకు కూరలు, కూరగాయలను మార్కెట్‌కు తీసుకెళ్లడానికి రవాణా సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. సబ్సిడీపై విత్తనాలు, డ్రిప్ పరికరాలు, స్ప్రింక్లర్లు ఇవ్వాలని కోరారు. భూసార పరీక్షలు చేసి ఏయే పంటలు వేయాలో తెలపాలన్నారు. కార్యక్రమంలో డీసీఓ ఈశ్వరయ్య, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, తహసీల్దార్ జయరాం, ఎంపీడీఓ అనురాధ, ఏఓ ప్రసన్నలక్ష్మి, పీఏసీఎస్ సీఈఓ మోహన్‌రెడ్డి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

**మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం**

**చేవెళ్ల:** నియోజకవర్గంలో నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజలను.. టికెట్ ఇచ్చిన పార్టీల నమ్మకాలను వమ్ము చేస్తూ పార్టీలు మారుతున్న ఎమ్మెల్యేకు సిగ్గుండాలంటూ చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎస్ రత్నం తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం ఆయన పార్టీ నాయకులతో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్‌లో గెలిచిన ఆయన అభివృద్ధి ముసుగు కప్పుకొని టీఆర్‌ఎస్‌లో చేరాడని.. ఇప్పుడు కారు గుర్తుపై ఓటేసి గెలిపిస్తే బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి మళ్లీ కాంగ్రెస్‌లో చేరారని మండిపడ్డారు. ఆయనకు కేవలం అధికారం, తన కుటుంబం, తన అక్రమాస్తులు కాపాడుకునేందుకే కండువాలు మార్చుతున్నాడని ఎద్దేవా చేశారు. దళితుల పరువు తీస్తున్న కాలె యాదయ్య ప్రజలకు ముక్కు నేలకు రాసి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో కాంగ్రెస్‌కు సైతం బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే పడుతుందన్నారు. ముఖ్యమంత్రి తప్పిదాలతోనే చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ ఓడిపోయిందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, వెంకటరాంరెడ్డి, పార్టీ మండలప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

# పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న అనితారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, కాలె యాదయ్య

- భూములు ఇచ్చిన రైతులకు ఇళ్ల స్థలాలు
- రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

**షాబాద్:** గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు మండల పరిధిలోని వెంకమ్మగూడ, ఊబ్బగుంట గ్రామాల్లో ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు అందిచామన్నారు. ఎన్నికల హామీలు దశలవారీగా అమలు చేస్తున్నామన్నారు. హైదరాబాద్ నగరానికి, శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు దగ్గరగా ఉన్న షాబాద్ మండలంతో పాటుగా చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. ప్రభుత్వ సహకారంతో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఇప్పటికే పరిశ్రమల ఏర్పాటుకు భూములిచ్చిన చందనవెళ్లి, హైతాబాద్, సోలీపేట్, సీతారాంపూర్ గ్రామాల రైతులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

### నియోజకవర్గ అభివృద్ధికి నిధులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. గత పదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి అత్యధిక నిధులు తీసుకువచ్చానని గుర్తు చేశారు. షాబాద్ మండలంలో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేసిన్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని ఈసీ, మూసీ వాగులపై వంతెన నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేశానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గుత్తి సునీత, మాజీ సర్పంచ్‌లు శంకుతల, నర్సింహారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాండు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, మాజీ సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, కృష్ణగౌడ్, ఈదుల కృష్ణగౌడ్, రమేశ్ యాదవ్, కుమ్మరి దర్శన్, మల్లేశ్, గణేశ్ గౌడ్, నాయకులు రామస్వామి, చెన్నయ్య, వెంకటయ్య, నర్సింహులు, సుదర్శన్, అవిలాష్‌గౌడ్, నరేందర్, బొజ్జయ్య, గ్రామస్తులు తదితరులున్నారు.

# రూ.20 కోట్ల భూమికి ఎసరు!

## కబ్జా చేస్తున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు



తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాలాపూర్ గ్రామస్తులు

- కార్పొరేషన్ పాలకుల హస్తం ఉందంటూ ఆరోపణలు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాలాపూర్ దళితులు

**బడంగ్‌పేట్:** ప్రభుత్వ భూమిపై కబ్జాదారుల కన్ను పడింది. సుమారు రూ.20 కోట్లకు పైగా విలువ చేసే భూమిని కాజేసే కుట్రకు అక్రమార్కులు తెరలేపారు. రెవెన్యూ అధికారులు, బడంగ్‌పేట పాలక వర్గంలోని కొందరు బడా నేతలు కుమ్మక్కై ఈ తతంగానికి యత్నించారు. అడ్డుకోవాల్సిన అధికారులు సైతం మిన్నకుండడం అనుమానాలకు తావిస్తోంది. బాలాపూర్ పరిధిలోని ఏఆర్‌సీఐ గోడలకు ఆనుకుని సర్వే నంబర్ 74లో సుమారు 2.5ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి కబ్జాకు ఫేక్ డాక్యుమెంట్స్ సృష్టించారు. కార్పొరేషన్ పాలకవర్గంలోని కొందరితో చేతులు కలిపి రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని ప్రహరీ ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మాణానికి పూనుకున్నారు. 2010–12లో కబ్జాకు యత్నించగా.. సరూర్‌నగర్ రెవెన్యూ అధికారులు అడ్డుకుని ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

### కలెక్టర్‌కు ఫిర్యాదు

ఏఆర్‌సీఐ ఏర్పాటులో భాగంగా 96 కుటుంబాల నుంచి 96 ఎకరాల భూమిని ఇచ్చామని బాలాపూర్ దళితులు చెబుతున్నారు. ప్రహరీ నిర్మించే సమయంలో వదిలేసిన మూలలు 2.5 ఎకరాలుండగా అన్యాక్రాంతానికి పాల్పడుతున్నారని.. ఈ భూమిని కాపాడి ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించాలని గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కబ్జాలకు సూత్రధారుడిగా వ్యవహరిస్తున్న సింగిరెడ్డి జైహింద్‌రెడ్డి అతని సోదరులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



ఆర్‌సీఐ రోడ్డులోని కబ్జాకు గురవుతున్న స్థలం ఇదే

### రిపోర్టు ఆధారంగా చర్యలు

బాలాపూర్‌లోని ఆర్‌సీఐ రోడ్డులోని భూమి కబ్జా అయిందని మా దృష్టికి వచ్చింది. ఆ భూమి ప్రభుత్వానిదా? ప్రైవేటుదా తేల్చాల్సి ఉంది. సర్వేయర్‌ను పంపాం. వారి రిపోర్టు ప్రకారం రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుని చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూమిగా తేలితే నిర్మాణాలను కూల్చివేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

– మాధవిరెడ్డి, తహసీల్దార్, బాలాపూర్

## క్లుప్తంగా

### డివైడర్‌ను ఢీకొట్టిన లారీ



ఘటనా స్థలంలో లారీ

**తాండూరు టౌన్:** లారీ డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటన మంగళవారం తెల్లవారు జామున తాండూరు పట్టణంలో చోటుచేసుకుంది. చించోళి నుంచి తాండూరు వైపునకు వస్తున్న వాహనం(టీఎస్07 యూజీ 5349) శివాజీ చౌక్ సమీపంలోకి రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వెంకటయ్య స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరకున్నారు. జేసీబీ సహాయంతో లారీని పక్కకు తొలగించారు. డ్రైవర్ నిద్రమత్తుతోనే ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్‌ఐ రాములు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

### ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌కు సన్మానం



రాజయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

**షాద్‌నగర్:** రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను మంగళవారం పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రాజయ్య నివాసంలో ఆయన్ను సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.

### డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ర్యాలీలో అధికారులు తదితరులు

**అనంతగిరి:** డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా పరిషత్ సీఈఓ సుధీర్ అన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలో మతాశిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి బాబు జగ్జీవన్ రామ్ కూడలి వరకు అబ్కారీ పోలీసులు, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్తుతో జీవితాలు చిత్తవుతున్నాయని, ద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యతని ఆయన సూచించారు. ఇందులో అబ్కారీ డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, మహిళా సంక్షేమ అధికారి వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజ్, జిల్లా పంచాయతీ అధికారి, జయసుధ పాల్గొన్నారు.

### ఎస్‌ఐకి సత్కారం

**ఆమనగల్లు:** ఆమనగల్లు ఎస్‌ఐ శ్రీనివాసులును మండల పరిధిలోని మేడిగడ్డతండాకు చెందిన నాయకులు సత్కరించారు. పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఇటీవల ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులును నాయకులు రవీందర్‌నాయక్, మేడిగడ్డ తాండా మాజీ సర్పంచ్ అమర్‌సింగ్‌లు మర్యదపూర్వకంగా కలిశారు.

# మోసపోతే గోసపడతాం

- కొలువులు సాధించే వరకు విశ్రమించేది లేదు
- నిరుద్యోగులను పట్టించుకోని ప్రభుత్వం
- బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, నాయకులు
- 5న కలెక్టరేట్ల ఎదుట ధర్నాకు పిలుపు



వికారాబాద్: తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నేతలు, నిరుద్యోగులు

**అనంతగిరి:** 'నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ ప్రత్యేక తెలంగాణ తెచ్చుకున్నాం. కానీ నియామకాల విషయంలో నిరుద్యోగులు మోసపోతున్నారు. గత ప్రభుత్వం చూపించినట్లుగానే నేటి కాంగ్రెస్ సర్కార్ నిరుద్యోగ యువతకు మొండిచేయి చూపుతోంది. మోసపోతే గోసపడతాం. కొలువులు సాధించేవరకు విశ్రమించేది లేదు' అని బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ స్పష్టంచేశారు. పార్టీ పిలుపు మేరకు మంగళవారం వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయం ముందు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్ రెడ్డి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల మాట్లాడారు. గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలని, గ్రూప్–2,3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలని కోరారు. 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని డిమాండ్ చేశారు.

**జీఓ 46ను రద్దుచేయాలి**

ప్రస్తుత డీఎస్సీని రద్దుచేసి, కొత్తగా ప్రకటించాలని, అన్ని నియామకాల్లో మహిళా అభ్యర్థులకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలని మహేందర్ కోరారు. కాని స్టేబుల్ నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీఓ 46ను వెంటనే రద్దు చేసి, జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. నిరుద్యోగులు చేస్తున్న న్యాయమైన పోరాటాన్ని ప్రభుత్వం అణచివేయాలని చూస్తుందని ఆయన ఆరోపించారు. వారి సమస్యలు పరిష్కరించే వరకు బీజేవైఎం అండగా ఉంటుందని, అందులో భాగంగా ఈ నెల 5న అన్ని కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేపడతామని తెలిపారు. అనంతరం తహసిల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్లనందు, జిల్లా ఉపాధ్యక్షుడు వివేకనందారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి అనిల్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ ముదిరాజ్, మండల అధ్యక్షుడు జగన్నాథ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్, వెంకట్, రవి, సాయికృష్ణ ఉన్నారు.

### మెగా డీఎస్సీని ప్రకటించాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

**ధారూరు:** గ్రూప్–1 పోస్టుకు 1:100గా క్వాలిఫై చేయాలని, గ్రూప్–2,3 పోస్టులను పెంచి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని బీజేపీ, బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. టీచర్ పోస్టులు పెంచి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేయాలని కోరారు. అనంతరం డిప్యూటి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇందులో బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు రఘుపతి, ఉపాధ్యక్షుడు సాయిగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింలు, కృష్ణ, నాయకులు ఉన్నారు.

# చిలకవాగు ప్రక్షాళనకు ప్రణాళిక

- రూ.16 కోట్లతో నిర్మాణ పనులు
- మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న



చిలకవాగును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ స్వప్న, కమిషనర్, కౌన్సిలర్, అధికారులు

**తాండూరు టౌన్:** చిలకవాగు ప్రక్షాళనకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న అన్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డితో కలిసి పాతకుంట సమీపంలోని వాగును ఆమె పరిశీలించారు. అనంతరం స్వప్న మాట్లాడారు. వరదనీరు సక్రమంగా పట్టణ శివారుకు వెళ్లేందుకు వాగులో కాలువ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకోసం రూ.16 కోట్ల నిధులు మంజూరయ్యాయని, డీపీఆర్ కూడా తయారు చేశామని చైర్‌పర్సన్ వెల్లడించారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభమయ్యేలా చూస్తామన్నారు. హైదరాబాద్ రోడ్డు మార్గం నుంచి మొదలు.. పాత తాండూరు శివారు వరకు సుమారు 4 కిలో మీటర్లకు పైగా వాగును విస్తీర్ణం చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. చిన్న డ్రైన్ల నిర్మాణం చేపట్టి, వాటిని ప్రధాన డ్రైన్‌కు అనుసంధాన చేస్తామని స్పష్టంచేశారు. చిలకవాగును కబ్జా చేసి, అక్రమంగా నిర్మాణాలు చేపడితే.. రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బి అధికారుల సమన్వయంతో తక్షణమే వాటిని కూల్చేస్తామని హెచ్చరించారు. భారీ వర్షాలు వచ్చినపుడు వరదనీరు జనావాసాల్లోకి రాకుండా వాగు అభివృద్ధితో ఇబ్బందులకు అడ్డుకట్ట వేయనున్నట్లు పేర్కొన్నారు. చైర్‌పర్సన్‌తో పాటు మున్సిపల్ డీఈ ఖాజాహుస్సేన్, కౌన్సిలర్ విజయాదేవి, కాంగ్రెస్ నాయకులు బాల్‌రెడ్డి, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

# బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



తరుణ్ కుమార్ మృతదేహం

**అనంతగిరి:** బైక్ అదుపు తప్పి యువకుడు మృతి చెందిన సంఘటన వికారాబాద్ మండలంలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి ఎర్రవల్లి గ్రామానికి చెందిన సొప్పరి తరుణ్ కుమార్(21) సోమవారం రాత్రి వికారాబాద్‌కు పని నిమిత్తం ద్విచక్రవాహనంపై వచ్చాడు. అనంతరం తిరుగు ప్రయాణంలో తన స్నేహితుడిని బైక్ పై ఎక్కించుకొని అయన ఇంటి వద్ద వదిలి పెట్టాడు. అక్కడి నుంచి గ్రామానికి వెళ్తున్న క్రమంలో పుల్ మద్ది గేటు సమీపంలో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తరుణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా కొత్త చట్టం ప్రకారం ఇది మొదటి కేసని, నూతన చట్టం సెక్షన్ 106(1) బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సాహిత) 2023 ప్రకారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# ప్రజా సేవలోనే జీవితం సార్థకం

మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి




మాట్లాడుతున్న గురునాథ్‌రెడ్డి

**కొడంగల్:** ప్రజా సేవలోనే జీవితం సార్థకం అవుతుందని రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్, కొడంగల్ లయన్స్ క్లబ్ ఫౌండర్, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని కేఎస్‌వీ పంక్షన్ హాల్‌లో నిర్వహించిన లయన్స్ క్లబ్ 36వ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో మెలగాలని సూచించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య, దంత వైద్య, రక్తదాన శిబిరం, ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం, మొక్కలు నాటడం, చెవిటివారికి వినికిడి యంత్రాల పంపిణీ తదితర కార్యక్రమాలను చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ నటరాజ్, లయన్స్ క్లబ్ ప్రోగ్రాం చైర్మన్ ముద్దప్ప దేశ్‌ముఖ్, ఇనస్టాలేషన్ అధికారి మృత్యుంజయ, అతిథులు అశోక్‌కుమార్ యాదవ్, బసనప్ప యాదవ్, సభ్యులు దాసప్ప యాదవ్, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి దేశ్‌ముఖ్, ఏన్గుల భాస్కర్, శ్రీకిషన్‌రావు, జయతీర్థాచారి, శివరాజ్ పాటిల్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ నియామకం**

లయన్స్ క్లబ్ పట్టణ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా మురహరి వశిష్ట, కార్యదర్శిగా కటుకం శివకుమార్ గుప్తా, కోశాధికారిగా వెంకట్‌రెడ్డి దేశ్‌ముఖ్‌లను నియమించగా.. వారు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం డాక్టర్ డేను పరస్కరించుకుని వైద్యులకు సన్మానం చేశారు. విద్యార్థులకు బ్యాగులు, కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

# ఉసురు తీసిన కుటుంబ కలహాలు

రైలు ఢీకొని తండ్రి కూతురు మృతి



మృతుడు శివానంద్(ఫైల్)



మృతురాలు చందన (ఫైల్)

**కుల్కచర్ల:** కుటుంబ కలహాలతో కలత చెందిన తండ్రి ఆత్మహత్యకు సిద్ధపడగా.. కాపాడబోయిన కూతురుతో పాటు ఇద్దరూ మృత్యువాత పడ్డారు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కుల్చచర్ల మండల పరిధి చౌడాపూర్‌ల మండలం మందిపల్ గ్రామానికి చెందిన శివానంద్(51) భార్య లావణ్యలకు కుమారుడు సాయి, కూతురు చందన ఉన్నారు. 25 సంవత్సరాలుగా ఈ కుటుంబం మహబూబ్‌నగర్ జిల్లా శివరాంనగర్ కాలనీలో నివాసం ఉంటోంది. ఈ క్రమంలో భూమి విషయంలో ఇంట్లో గొడవ జరగగా.. మనస్థాపం చెందిన శివానంద్.. రైలు పట్టాలపై నిల్చున్నాడు. ఇది గమనించిన కూతురు, కుమారుడు తండ్రిని కాపాండేదుకు యత్నించగా.. వేగంగా వచ్చిన రైలు.. తండ్రి శివానంద్, తనయ చందనను ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరూ మృత్యువాత పడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలకు కుటుంబ సభ్యులు మందిపల్‌లో అంత్యక్రియలు పూర్తి చేశారు.

# సేవ చేయలేదు.. గుర్తింపు పొందలేదు

- ప్రజాసమస్యలపై మొరపెట్టుకున్నా స్పందించని అధికారులు
- ఎంపీటీసీ సభ్యుల ఆవేదన
- అధికారులు జవాబుదారీగా ఉండాలి
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచన




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**పెద్దేముల్:** 'తమ ఐదేళ్ల పదవీ కాలంలో ప్రజలకు సేవ చేసిందీ లేదు. గుర్తింపు పొందిందీ లేదు. గ్రామసభల్లో కనీస గౌరవం దక్కిందీ లేదు' అని ఎంపీటీసీ సభ్యులు వాపోయారు. అధికారులు కూడా తమను గుర్తించలేదని ఆరోపించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనురాధ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశాల్లో ప్రజా సమస్యలపై మొరపెట్టుకున్నా.. అధికారులు మినిట్ బుక్ కూడా రాయలేదని, రికార్డుల్లో నమోదు చేయకపోతే సమస్యలు ఎలా పరిష్కారమవుతుయాని ఎంపీడీఓ జర్నప్పపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

**ఎంపీటీసీల గోస ఇప్పటిది కాదు..**

అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, సమావేశంలో మినిట్స్ బుక్ తప్పకుండా పాటించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. వెంటనే సమస్యలను నోట్ చేసుకొని, వచ్చే సమావేశంలో చర్చించాలని ఆదేశించారు. రూ.120 కోట్లతో కోటపల్లి ప్రాజెక్టు రైట్, లెఫ్ట్ కెనాల్‌ను త్వరలో మరమ్మతు చేపట్టనున్నామని, కాలువలను ఎవరైనా కబ్జా తగిన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఏఈ అఖిల్ చెప్పారు. కోటపల్లి ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ సహకారంతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ఎప్పటి కప్పుడు సర్వే చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఎంపీటీసీ సభ్యుల గోస జడ్పీటీసీ సభ్యుడిగా ఉన్నప్పటి నుంచి చూస్తున్నానని, వారి సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తుందని చెప్పారు.

**కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ**

మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎమ్మెల్యే బీఏ మ్మార్ 48 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, తదితర పథకాలను అమలు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనురాధ, జడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్, వైస్ ఎంపీపీ మధులత, ఎంపీడీఓ జర్నప్ప, ఎమ్మార్వో కిషన్, ఆర్ఐ రాజీరెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం



భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పేదలకు నాణ్యమై వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దేమూల్ మండల పరిధి మన్‌సాన్‌పల్లి, మారేపల్లి, కందనెల్లితండా తదితర గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మండల కేంద్రంలో సుమారు రూ.కోటి 30లక్షలతో నిర్మించిన ఆరు పడగల పీహెచ్‌సీ, రూ.20లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం సర్కారు దవాఖానాల్లో నాణ్యమైన వైద్యంతో పాటు తగిన సౌకర్యాలు కల్పిస్తుందని, ప్రజలు ధర్మాసుపత్రులను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి పాల్వన్ కుమార్, డాక్టర్ బుచ్చిబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభరాణి తదితరులు పాల్గొన్నారు.



### ఎన్నికల హామీలను నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

**అనంతగిరి:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోళ్ల జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వికారాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగులకు రూ.6 వేలు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4 వేల చొప్పున పింఛన్లు ఇస్తామని చెప్పి, ఇవ్వడం లేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వెంటనే పింఛన్లను పెంచాలని కోరారు. లేని పక్షంలో ఈ నెల 6నుంచి 16 వరకు మండల కేంద్రాల్లో నిరవధిక నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాంప్రసాద్, రాష్ట్ర నాయకులు రాజు, వెంకటయ్య, చిట్టి రాజు, హుస్సేన్ బీ తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపాలిటీకి రూ.3.05 లక్షల ఆదాయం

**ఆమనగల్లు:** మాంసాహార దుకాణాల నుంచి వెలువడే వ్యర్థాలను తొలగించేందుకు మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం 2024–25 సంవత్సరానికి వేలం పాట నిర్వహించారు. ఈ పాటలో పట్టణానికి చెందిన ఆంజనేయులు రూ.3.05 లక్షలకు వ్యర్థాల తొలగింపు హక్కులను దక్కించుకున్నాడు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య, మున్సిపల్ కమిషనర్ వసంత పాల్గొన్నారు.

# అయ్యోపాపం.. మూగజీవాలు

**పొలంలో విద్యుదాఘాతం.. కాడెద్దు మృతి**

- రైతు అప్రమత్తతతో ఇంకో ఎద్దు సేఫ్
- ఉబ్బకుంటలో పాడి పశువుల మృతి
- ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం వలనే ప్రమాదం: స్థానికుల ఆరోపణ



కాడితో ఎద్దు కళేబరం

**కందుకూరు:** పొలం పనుల్లో ఉన్న కాడెడ్లలో ఒకటి విద్యాదాఘాతానికి గురై మృత్యువాత పడగా.. రైతు అప్రమత్తతో మరో దానికి ప్రమాదం తప్పింది. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత రైతు, కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి బాచుపల్లికి గ్రామానికి చెందిన పగడాల యాదయ్య, తనకు చెందిన ఎడ్లతో అద్దె రూపేణా.. కప్పాటి బబూల్‌మోహన్‌రెడ్డి పొలంలో అరక కట్టి, మొక్కజొన్న విత్తనాలు విత్తుతున్నారు. అరకతో రైతు యాదయ్య ముందు వెళ్తుండగా.. వెనకాల కూ లీలు విత్తనాలు వేస్తూ ముందుకు సాగుతున్నారు.

**సపోర్ట్ తీగకు విద్యుత్ సరఫరా**

పొలంలో ఉన్న విద్యుత్ స్తంభంపై తీగలకు ఉండే ఇన్సులేటర్ పగిలిపోయి, కాసారం ద్వారా సపోర్టు వైరుకు కరెంటు సరఫరా అవుతోంది. ఇది గమనించని రైతు, కూలీలు పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో ఓ ఎద్దుకు కరెంటు పోల్ సపోర్టు వైర్ తగలగా.. షాక్‌తో అది అక్కడికక్కడే మృత్యువాత పడింది. అప్రమత్తమైన రైతు మరో ఎద్దు తాడు విప్పి ప్రమాదం బారిన పడకుండా కాపాడాడు. వారు తప్పించుకున్నారు. గ్రామస్తుల సమాచారంతో ట్రాన్స్‌కో అధికారులు సరఫరాను నిలిపివేశారు. ఇదిలా ఉండగా.. విద్యుత్ అధికారుల తప్పిదం వలనే మూగజీవి మృత్యువాత పడిందని, తాము తప్పించుకోగలిగామని రైతులు, కూలీలు వాపోయారు. ఎద్దును కోల్పోయిన బాధిత రైతు యాదయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలను తెలుసుకున్నారు.

### వేలాడుతున్న వైర్లు తగిలి..



పాడిపశువుల కళేబరాలు

**షాబాద్:** వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి రెండు మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండల పరిధి ఉబ్బకుంట గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన మోత్కూరి శేఖర్ తన పాడిపశువులను మేత కోసం వదిలాడు. ఈ క్రమంలో అవి మేతమేస్తూ.. చిల్కమర్రి గ్రామ శివారులో సత్యనారాయణ మామిడి తోట వేలాడుతున్న విద్యుత్ తీగలకు తగిలాయి. దీంతో షాక్ గురై చనిపోయాయి. వాటి విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు శేఖర్ కోరాడు. వేలాడుతున్న వైర్ల గురించి పలుమార్లు ట్రాన్స్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు.

# ప్రభుత్వానికి అభిప్రాయాలు నివేదిస్తాం

వ్యవసాయ సహకార సంఘం జిల్లా అధికారి ధాత్రిదేవి



చేవెళ్ల: మాట్లాడుతున్న ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, చిత్రంలో ధాత్రిదేవి

**చేవెళ్ల:** రైతు భరోసా పథకం అమలుకు రైతులు తమ అభిప్రాయాలను చెప్పాలని వ్యవసాయ సహకార సంఘం జిల్లా అధికారి ధాత్రిదేవి, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం సొసైటీ ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. 200 మంది సభ్యులుండగా వందకు పైగా మంది పది ఎకరాలకు ఇవ్వాలని.. 50 మంది ఐదెకరాలకే పరిమితం చేయాలన్నారు. సాగు భూమిని గుర్తించి ప్రతి ఎకరాకు అందివాలని మరికొందరు అభిప్రాయపడ్డారు. రైతుల సూచనలు, అభిప్రాయాలను త్వర్లోనే ప్రభుత్వానికి అందజేస్తామని ధాత్రిదేవి అన్నారు. కార్యక్రమంలో ఆడిటర్స్ నర్సింహారావు, ఉస్మాన్, వైస్ చైర్మన్ మల్లేశ్, డైరెక్టర్లు పి.రాములు, లక్ష్మయ్య, ప్రవీణ్‌రెడ్డి, మాధవరెడ్డి, నరేందర్, రాఘవరెడ్డి, శివరాజ్, ఉపేందర్ సింగ్, అరుణమ్మ, బాలమ్మ, సీఈఓ భరత్‌కుమార్, మాజీ చైర్మన్ బల్వంత్‌రెడ్డి, రైతులు, వ్యవసాయాధికారి తులసి, ఏఈఓ వరుణ్ తదితరులున్నారు.

**పక్కాగా రైతు 'భరోసా'**

**మొయినాబాద్:** రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తుందని వ్యవసాయ సహకార సంఘం జిల్లా అధికారి ధాత్రిదేవి అన్నారు. మొయినాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార కేంద్రం చైర్మన్ చంద్రారెడ్డి అధ్యక్షతన భరోసా పథకంపై రైతుల అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భరోసా పథకాన్ని ఎన్ని ఎకరాల వరకు ఇవ్వాలని.. రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో 10 ఎకరాల వరకు భరోసా ఇవ్వాలని కొందరు రైతులు అంటే, 5 ఎకరాల వరకే ఇవ్వాలని మరికొందరు, సాగుచేసే ప్రతి ఒక్కరికీ భరోసా అమలు చేయాలని ఇంకొందరు తెలిపినట్లు ఆమె వెల్లడించారు. మీమీ అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని ధాత్రిదేవి తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాగమ్మ, ఏఈఓలు కుమార్, సునీల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దర్గ మహేందర్, డైరెక్టర్లు జనగర్‌మోహన్‌రెడ్డి, ఉప్పరి శ్రీనివాస్, రాఘవరెడ్డి, యాదయ్య, గంగమ్మ, భూపాల్‌రెడ్డి, రాంరెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.